క్లుప్తంగా

9న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

చిత్తూరు కార్పొరేషన్: దేశవ్యాప్తంగా కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు నాగరాజన్ తెలిపారు. నగరంలో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై జరిగే సమ్మెలో యావత్ కార్మికవర్గం పాల్గొనాలన్నారు. బ్రిటీష్ ప్రభుత్వంలో కార్మికవర్గం ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న 8 గంటల పని విధానాన్ని చట్టాలను తుంగలో తొక్కాలని చూస్తున్నారన్నారు. ప్రస్తుతం 10–12 గంటలు పని చేయాలని నిబంధనలు పెట్టడం దుర్మార్గపు చర్య అని విమర్శించారు. ఈ విధానాన్ని రాష్ట్రప్రభుత్వం వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్‌లో కార్మికుల హక్కులను ప్రశ్నించడానికి సంఘాలు పెట్టుకునే పరిస్థితి లేకుండా చేస్తున్నారని వాపోయారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మిక వర్గం పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు చంద్ర, గోపినాథ్, రమాదేవి, విజయ్‌కుమార్, మణికంఠ, శంకర్, కమల్, లత, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

యాదమరి: రానున్న వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల ముప్పు పొంచి ఉండే అవకాశం ఉందని, ప్రజలు ఈ విషయంపై అప్రమత్తంగా ఉండాలని డా.అనీల్ అన్నారు. శనివారం ఆయన మండల పరిధిలోని జంగాలపల్లిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రజలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపించాలన్నారు. ఈ సమయంలో డెంగీ, మలేరియా వంటి జ్వరాలు ముప్పేట దాడి చేసే ప్రమాదం ఉందన్నారు. ప్రజలు అనారోగ్యం బారిన పడితే చికిత్స కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లనవసరం లేదని, గ్రామాలకే 104 వైద్య సంచార వాహనంతో పాటు వైద్య సిబ్బంది వస్తారని తెలిపారు. ఉచితంగా వైద్య పరీక్షలు చేసి, అవసరమైన మందులను అందజేస్తారన్నారు. గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేసుకోవడంతో పాటు పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలోని పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ శ్రీనివాస మూర్తి, వైద్యసిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

వినాయకుడి సేవలో ప్రముఖులు



స్వామివారి సేవలో వాణిజ్యశాఖ కార్యదర్శి

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామిని శనివారం రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్, పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి చిరంజీవి చౌదిరి స్వామివారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చూశారు. ఆలయ ఈఓ పెంచల కిషోర్ స్వామివారి ప్రసాదం, చిత్రపటం అందజేశారు.

రాజనాలబండలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

చౌడేపల్లె: సత్య ప్రమాణాలకు నిలయమైన రాజనాల బండలో ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో స్వామివారికి ఆకుపూజ, అభిషేకాలు చేశారు. పుంగనూరు, మదనపల్లె, చిక్‌బలాపురం నుంచి వివిధ చోరీ కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు రాజనాలబండకు వచ్చారు. అర్చకులు ఇరువర్గాలతో సమావేశమై ప్రమాణం చేయడానికి వారం రోజులు గడువునిచ్చారు.

వివాదాలకు కేరాఫ్.. పీసీఆర్..

చిత్తూరు నగరం నడిబొడ్డులో ఉన్న పీసీఆర్ ప్రభుత్వ, ఒకేషనల్ కళాశాలు వివాదాలకు కేరాఫ్‌గా నిలుస్తోంది. ఈ రెండు కళాశాలలకు ఎంతో ఘన చరిత్ర ఉంది. అయితే నిత్యం ఏదో ఒక సమస్యతో ఈ రెండు కళాశాలల మధ్య వివాదాలు నడుస్తూనే ఉన్నాయి. ఇవి ముదిరి శనివారం ఒకేషనల్ కళాశాల అధ్యాపకులను, విద్యార్థులను అడ్డుకునే వరకు వెళ్లింది. పీసీఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్, సిబ్బంది కళాశాలలో అడ్డంగా తాడు కట్టించిన ఘటన విమర్శలకు తావిచ్చింది. అడ్మిషన్ల కోసం కళాశాలకు వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులు తాడు కట్టడంపై ఆశ్చర్యపోయారు.

- పీసీఆర్ జూనియర్, ఒకేషనల్ కళాశాలల్లో ఆధిపత్య పోరు
- ప్రిన్సిపల్స్ మధ్య మరింత ముదిరిన వివాదం
- రిజిస్టర్‌లో సంతకం చేసి విధులకు డుమ్మా కొడుతున్న కొందరు అధ్యాపకులు
- తాగి కళాశాలలకు వస్తున్న మరికొందరు
- కళాశాలలను తనిఖీ చేసిన డీఐఈఓ



పీసీఆర్ కళాశాల, ఒకేషనల్ కళాశాల మధ్య ప్రాంగణంలో వివాదాల నేపథ్యంలో అడ్డంగా కట్టిన తాడు



ఒకేషనల్ కళాశాల విద్యార్థుల చేత పుస్తకాలు మోయిస్తున్న దృశ్యం

చిత్తూరు కలెక్టరేట్ : ఒకే ప్రాంగణంలో రెండు కళాశాలలు ఉండడం వల్ల పీసీఆర్ కాలేజీల ప్రిన్సిపల్స్ మధ్య సమన్వయ లోపం తలెత్తుతోంది. ఏటా అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమయ్యే సమయంలో ఆ రెండు కళాశాలల మధ్య వివాదాలు అధికమవుతున్నాయి. పీసీఆర్ ప్రభుత్వ, ఒకేషనల్ కళాశాలల మధ్య కొనసాగుతున్న వివాదాల సమస్య రాష్ట్ర ఇంటర్మీడియట్ కమిషనర్ దృష్టికి వెవెళ్లింది. త్వరలో ఈ వివాదాలకు సంబంధించి విచారణ నిర్వహించనున్నట్లు విశ్వసనీయ సమాచారం. ప్రభుత్వ యాజమాన్య ఒకేషనల్ కళాశాలకు అడ్మిషన్లు రాకుండా చేయడంపై, అదే ప్రభుత్వ యాజమాన్య జూనియర్ కళాశాలలో అధ్యాపకుల వ్యవహార శైలి వివాదాలకు దారితీస్తోంది. మద్యం తాగి వచ్చే ఓ అధ్యాపకుడు, అతనితో పాటు మరి కొంతమంది అనుచరులు సమయం.. సందర్భం లేకుండా కళాశాలలోకి రావడం మరో వివాదానికి కారణమవుతోంది.

హాజరు వేసి విధులకు డుమ్మా..

పీసీఆర్ కళాశాలల్లో పనిచేస్తున్న కొంతమంది అధ్యాపకులు హాజరు వేసి విధులకు డుమ్మా కొడుతున్నారు. అధ్యాపకులు కేవలం హాజరు వేయడంతో సరి, వారు తరగతికి వెళ్లి విద్యార్థులకు పాఠాలు చెబుతున్నారా? లేదా? అని పర్యవేక్షించే నాథుడే పీసీఆర్ ప్రభుత్వ, ఒకేషనల్ కళాశాలల్లో కరువయ్యారు. శనివారం పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బోటనీ తరగతిలో విద్యార్థినులు ఉన్నా, అధ్యాపకుడు మాత్రం హాజరు వేసి విధులకు డుమ్మా కొట్టాడు. మరో తరగతిలో అధ్యాపకుడి ముందే విద్యార్థులు ఆకతాయిల్లా కొట్టుకుంటున్న సన్నివేశం కనిపించింది. మరోవైపు ఒకేషనల్ కళాశాల అధ్యాపకులు విద్యార్థులచేత పాఠ్యపుస్తకాలు మోయించడం, అవసరమైన పనులకు వారిని వాడుకోవడం సైతం విమర్శలకు తావిస్తోంది. ఈ విషయంపై పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ అబ్దుల్ మజీద్‌ను వివరణ కోరగా ద్విచక్ర వాహనాలు, బయటి వ్యక్తులు లోపలకు రాకుండా దారం కట్టించామని చెప్పారు. అదే విధంగా ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపల్ మహేష్‌ను వివరణ కోరగా ఒకేషనల్ కళాశాల అని తమను, జూనియర్ కళాశాల అధికారులు చిన్నచూపు చూడడం, అడ్మిషన్లు రాకుండా అడ్డుకోవడం చేస్తున్నారని ఆవేదన చెందారు.

విచారించిన ఇన్‌చార్జ్ డీఐఈఓ



తరగతి గదులను పర్యవేక్షిస్తున్న ఇన్‌చార్జ్ డీఐఈఓ దయానందరాజు

ఈ కళాశాలల మధ్య జరుగుతున్న వివాదాలను ఇంటర్మీడియట్ జిల్లా ఇన్‌చార్జ్ డీఐఈఓ దయానందరాజు విచారించారు. కళాశాలకు అడ్డంగా కట్టిన తాడుపై ప్రిన్సిపల్ అబ్దుల్ మజీద్‌ను వివరణ కోరి, వెంటనే ఆ తాడును తొలగించాలని చెప్పారు. అనంతరం పీసీఆర్ కళాశాలలోని ప్రతి తరగతి గదిని పరిశీలించి పలువురు అధ్యాపకుల వ్యవహార శైలిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తీరు మార్చుకోకపోతే రాష్ట్ర అధికారులకు ఫిర్యాదు చేస్తానని ఆయన హెచ్చరించారు.

సమస్యలు పరిష్కరించకపోతే పోరాటమే



వన్ డిపో గేటు ఎదుట ధర్నా చేస్తున్న ఆర్టీసీ ఈయూ నేతలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఆర్టీసీ ఉద్యోగుల సమస్యను పట్టించుకోకుంటే పోరాటం చేయాల్సి వస్తుందని ఈయూ నాయకులు మురుగేషన్ జగన్నాథం హెచ్చరించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చిత్తూరు నగరంలోని వన్‌డిపో గేటు ఎదుట వారు శనివారం ధర్నా నిర్వహించారు. తమ డిమాండ్లను తక్షణం పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఆర్టీసీకి ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఉద్యోగుల బకాయిలను త్వరితగతిన చెల్లించాలన్నారు. డిపో సమస్యలపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని, డ్రైవర్లు, కండక్టర్లను వేధించవద్దన్నారు. కార్యక్రమంలో మహిళా నాయకులు లత, చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

8న ఉచిత కంటి వైద్య శిబిరం

పుంగనూరు(చౌడేపల్లె): పుంగనూరు పట్టణంలోని బీఎంఎస్ క్లబ్ ఆవరణలో 8న ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ జిల్లా పీఆర్‌వో డాక్టర్ పి.శివ తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ పుంగనూరు, మదనపల్లె లయన్స్‌క్లబ్ సంయుక్తంగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు వైద్యులు రోగులకు పరీక్షలు చేస్తారని వెల్లడించారు. ఆరోగ్యశ్రీ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు పాసుపుస్తకం తీసుకురావాలన్నారు.

నేతలకు ఆత్మీయ పరామర్శ



మొగిలివెంకటగిరిలో తులసీరామకృష్ణారెడ్డిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి

బంగారుపాళెం: మండలంలోని మొగిలివెంకటగిరి గ్రామానికి చెందిన మాజీ సమితి అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తులసీరామకృష్ణారెడ్డిని మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పరామర్శించారు. శనివారం ఆయన తులసీరామకృష్ణారెడ్డి స్వగృహానికి వెళ్లి అనారోగ్యంతో బాధ పడుతున్న ఆయనను పలకరించారు. యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అంతకుముందు బంగారుపాళెంలో అనారోగ్యం బారిన పడి కోలుకున్న జెడ్పీ మాజీ చైర్మన్ కుమార్‌రాజాను ఆయన పరామర్శించారు. ఆయన వెంట పలువురు నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలను తగ్గించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: రాష్ట్ర ప్రభుత్వం పెంచుతున్న విద్యుత్ చార్జీలను తగ్గించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్, జిల్లా సహాయ కార్యదర్శి జనార్దన్ డిమాండ్ చేశారు. శనివారం వారు స్థానిక ట్రాన్స్‌కో అర్బన్ ఈఈ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఒకవైపు నిత్యావసర ధరలు పెరుగుతున్నాయని, మరోవైపు విద్యుత్ చార్జీల రూపేణా రాష్ట్రవ్యాప్తంగా రూ.15 వేల కోట్ల భారం వినియోగదారులపై వేశారన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు కరెంట్ చార్జీలు పెంచమని, స్మార్ట్‌మీటర్లు పెట్టబోమని ప్రజలకు హామీ ఇచ్చారన్నారు. అదానీ సోలార్ విద్యుత్ ఒప్పందాలను రద్దు చేస్తామన్నారని, తీరా అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలో నాలుగు సార్లు చార్జీలు పెంచి వినియోగదారులపై భారం మోపారని ఆరోపించారు. గృహ సర్వీసుల్లో స్మార్ట్ మీటర్లను బిగించడానికి ప్రభుత్వం సిద్ధమైందని, ఈ విధానాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని దుయ్యబట్టారు. ఒక స్మార్ట్‌మీటర్ కొనుగోలు, ఏర్పాటుకు రూ.12 వేల నుంచి రూ.18 వేల వరకు ఖర్చు అవుతుందన్నారు. ఈ మొత్తాన్ని కూడా విద్యుత్ బిల్లులో కలిపే అవకాశం ఉందన్నారు. అనంతరం డీఈ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గోపినాథ్, మణి, విజయగౌరీ, చంద్ర, విజయ్‌కుమార్, కుమారి, రమాదేవి, బాలాజీరావు, రఘు, నాగరాజా, రమేష్ బాబు, లతారెడ్డి, కమల్ తదితరులు పాల్గొన్నారు.

సామాన్యుడిపై నిత్యావసర భారం

నిత్యావసర సరుకుల ధరలు మోత మోగుతుండడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పప్పుదినుసులు, కూరగాయలు, వంటనూనె, పండ్లు, ఇతర సరుకుల ధరలు కొనలేనంత స్థితికి చేరాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా నిత్యావసరాల ధరలు పెరగడంతో ప్రతి కుటుంబంపై అదనంగా రూ.5 వేల నుంచి రూ.10 వేలు భారం పడుతోంది. తొలి ఏకాదశి పండుగ రావడంతో సగటు సామాన్య, మధ్య తరగతి ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. మరోవైపు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందించకపోవడం కూడా ఒక కారణంగా చెప్పవచ్చు.

- ఆకాశాన్నంటుతున్న నిత్యావసరాల ధరలు
- మండుతున్న వంటనూనె
- పప్పుదినుసులు, కూరగాయలదీ అదే పరిస్థితి
- తొలి ఏకాదశికి సామాన్య, మధ్య తరగతి ప్రజలపై తప్పని అదనపు ఖర్చులు
- ప్రభుత్వ పథకాలు అందక మరింత భారం



గుడిపాల : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించేందుకు చర్యలు చేపట్టకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చిత్తూరు నియోజకవర్గంలో 75 వేలకు పైగా కుటుంబాలు ఉన్నాయి. వీరిలో 80 శాతం కుటుంబాలు పేద, మధ్య తరగతి కుటుంబాల వారే. వీరి సగటు ఆదాయం నెలకు రూ.10 వేల నుంచి రూ.15 వేల లోపే. గతంలో ఓ కుటుంబానికి నిత్యావసరాలు, కూరగాయలు, పాలకు కలిపి రూ.10 వేల వరకూ ఖర్చయ్యేది. ఇదే క్రమంలో పెరిగిన నిత్యావసర ధరల కారణంగా సామాన్య, మధ్య తరగతి ప్రజల ఖర్చు విపరీతంగా పెరిగిపోయింది. దీంతో సామాన్యులు తమ ఆదాయ వనరుల ప్రకారం ఖర్చులను తగ్గించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.

తొలి ఏకాదశికి పస్తులేనా ?

ఖరీఫ్ సీజన్ ప్రారంభ దశలో వచ్చే తొలి ఏకాదశి రైతులకు అతి ముఖ్యమైన పండుగ. నిత్యావసర ధరలు అమాంతం పెరగడంతో ఈసారి తొలి ఏకాదశి జరుపుకోవడానికి అన్నదాతలు ఆలోచన చేస్తున్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని నిత్యావసర సరుకులు ధరల తగ్గుదలకు కృషి చేయాల్సిన అవసరం ఉంది.

భగభగమంటున్న వంటనూనెలు:

వంట నూనెల ధరలు ఆకాశాన్ని అంటుతుండడంతో ప్రజలు అల్లాడుతున్నారు. రిఫైండ్ ఆయిల్ లీటరు ప్యాకెట్ రూ.140 నుంచి రూ.150 పలుకుతోంది. పిండి వంటలకు అధికంగా వినియోగించే పామాయిల్ లీటర్ ప్యాకెట్ ధర రూ.125 నుంచి రూ.135 వరకు ఉంది. గతంలో రిఫైండ్ ఆయిల్ లీటర్ ప్యాకెట్ ధర రూ.110 నుంచి రూ.115 వరకు, పామాయిల్ ప్యాకెట్ ధర రూ.100 నుంచి రూ.105 వరకు ఉండేది. దీనికి భిన్నంగా ఈసారి వంట నూనె ధరలకు రెక్కలు రావడంతో వినియోగదారులు తల్లడిల్లుతున్నారు.

దిగిరాని పప్పుదినుసుల ధరలు..

నిత్యావసర ధరలు పెరగడంతో మార్కెట్ వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. ఏ కూరగాయల ధర చూసినా కిలో రూ.40 తగ్గడం లేదు. కంది, పెసలు, ఉద్దిపప్పు దినుసులు కిలో రూ.130 నుంచి రూ.170 వరకు ఉన్నాయి. మార్కెట్‌లో కందిపప్పు నాణ్యత ఆధారంగా కిలో రూ.130 నుంచి రూ.170 వరకు ఉంది. ఉద్దిపప్పు కిలో రూ.125 నుంచి 160 వరకు విక్రయిస్తున్నారు. పెసలపప్పు కిలో రూ.120 నుంచి 150 వరకు అమ్ముతున్నారు. శనగపప్పు ధర రూ.120పైనే. వేరుశనగ కిలో రూ.130 నుంచి రూ.150 వరకు ఉన్నాయి.

రూ.5 వేలు అదనపు భారం..



నిత్యావరస సరుకులతో పాటు కూరగాయల ధరలు పెరిగిపోయాయి. దీంతో నెలకు అదనంగా రూ.5 వేలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. పెరిగిన ధరల కారణంగా ఖర్చు రెట్టింపు కావడంతో కూరగాయలు తక్కువగా కొనుగోలు చేస్తున్నాం.

– చిరంజీవి, గుడిపాల

ధరలు భయపెడుతున్నాయి..



ఎన్నడూ లేనివిధంగా మార్కెట్లో అన్ని నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగిపోయాయి. ఆదాయం తక్కువ, ఖర్చు ఎక్కువ అయిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ఏమీ కొనలేకపోతున్నాం. కూరగాయల ధరలు భయపెడుతున్నాయి.

– నీలావతి, గృహిణి, నరహరిపేట, గుడిపాల

భక్తి శ్రద్ధలతో మొహర్రం



ప్రార్థనల్లో పాల్గొన్న విజయానందరెడ్డి

చిత్తూరు రూరల్(కాణిపాకం): ముస్లింలు భక్తి శ్రద్ధలతో మొహర్రం ప్రశాంతంగా జరుపుకోవాలని వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి తెలిపారు. శనివారం మార్కెట్ చౌక్ ఏర్పాటు చేసిన పీర్లను దర్శించుకున్నారు. అనంతరం స్థానిక ముస్లిం నాయకులతో మాట్లాడారు. చివరిగా ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షుడు కేపీ శ్రీధర్, ముస్లింలు పాల్గొన్నారు.

రిటైర్డు ఉద్యోగులకు సన్మానం



పదవీ విరమణ పొందిన ఉద్యోగులతో ఎస్పీ, అధికారులు

చిత్తూరు అర్బన్: జిల్లా పోలీసు శాఖలో పదవీ విరమణ పొందిన పలువురు అధికారులు, సిబ్బందిని చిత్తూరు ఎస్పీ మణికంఠ సన్మానించారు. శనివారం నగరంలోని పోలీసు అతిథిగృహంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. మహిళా స్టేషన్ డీఎస్పీగా పనిచేసిన విజయశేఖర్, ఆర్ఎస్ఐ ఫజులుద్దీన్, ఏఎస్ఐలు గోవిందరాజులు, రవిచంద్రన్, రాజారెడ్డి, గౌరీశంకర్, సుబ్రమణ్యం నాయుడు, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ కుబేంద్రన్, హోంగార్డులు శ్రీనివాసులు, యేసయ్య, అలిమేలును దుశ్శాలువతో సన్మానించారు. విశేష సేవలు అందించిన వారిని ప్రశంసించారు. కార్యక్రమంలో ఏఎస్పీలు రాజశేఖర్‌రాజు, శివానంద కిషోర్, పోలీసు సంక్షేమ సంఘ నాయకులు ఉదయ్‌కుమార్, ఖాదర్ పాల్గొన్నారు.

సరిహద్దులు దాటిన క్యూ

మామిడి రైతుల క్యూ బారులు తీరుతోంది. ట్రాక్టర్లు వరుస కట్టడంతో తమిళనాడు చెక్ పోస్టును తాకాయి. ఆపై వద్దని తమిళనాడు చెక్ పోస్టు అధికారులు అడ్డుకుంటున్నారు. తగ్గని రద్దీతో మామిడి రైతులు పడిగాపులు అన్నీఇన్నీ కావు. అన్‌లోడింగ్ సమస్యలు రైతుల కంట కన్నీరు పెట్టిస్తున్నాయి. దీంతో తిండీతిప్పలు మాని ఫ్యాక్టరీల వద్ద అవస్థలు పడుతున్నారు.

- ఫ్యాక్టరీల వద్ద మామిడి కాయల అన్‌లోడింగ్‌కు 4–5 రోజుల సమయం
- తమిళనాడు చెక్‌పోస్టును తాకినట్రాక్టర్ల వరుస
- ఆపై వస్తే ట్రాఫిక్ అంతరాయం కలుగుతుందని హెచ్చరిక
- తిండీతిప్పలు మాని ఫ్యాక్టరీల వద్ద రైతుల పడిగాపులు



గుడిపాల మండలం తమిళనాడు సరిహద్దు వరకు క్యూకట్టిన ట్రాక్టర్లు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): గుడిపాల మండలం గొల్లమడుగులోని మ్యాంగో జ్యూస్ ఫ్యాక్టరీ వద్ద శనివారం మామిడి కాయల ట్రాక్టర్ల క్యూ భారీగా పెరిగింది. ఫ్యాక్టరీ నుంచి 3 కిలోమీటర్ల మేర సుమారు 500 నుంచి 600 ట్రాక్టర్లు వరుస కట్టడంతో తమిళనాడు సరిహద్దును దాటింది. ఆ తర్వాత ఆ సరిహద్దును దాటి (తమిళనాడు చెక్‌పోస్టు)క్రిష్టియాపేట చెక్‌పోస్టును తాకింది. ఆ తర్వాత చెక్‌పోస్టును దాటి వెళ్లొద్దని అక్కడి అధికారులు అడ్డుకుంటున్నారు. ఇలా క్యూ వస్తే..ట్రాఫిక్ సమస్య వస్తుందని చెక్‌పోస్టు గీత దాటొద్దని హుకుం జారీ చేస్తున్నారు. వారం తర్వాత మళ్లీ ఈ క్యూ పుంజుకుంది. రోడ్డుకు ఇరువైపులా ట్రాక్టర్లు క్యూకట్టాయి. అన్‌లోడింగ్‌కు 4 నుంచి 5 రోజుల సమయం పడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో బండి వదలి ఇంటికి వెళ్లే పరిస్థితి కూడా కనిపించడం లేదు. దోంగలకు భయపడి అక్కడే కునుకు తీస్తున్నారు.

కాయల కొనలేం..

గుడిపాల మండలం వేలూరు రహదారిలోని ఓ ఫ్యాక్టరీ కాయలు కొనలేమని బోర్డు పెట్టేసింది. గత నెల 29వ తేదీ నుంచే కాయల కొనుగోలు ఆపేసినట్లు బోర్డు పెట్టేసింది. ఫ్యాక్టరీ వద్దకు వచ్చే ట్రాక్టర్లను సిబ్బంది బోర్డు చూపించి తిప్పి పంపించేస్తున్నారు. దీంతో గుడిపాల మండలం గొల్లమడుగు, కొత్తపల్లి ప్రాంతాల్లోని ఫ్యాక్టరీల వద్దకు మరిన్ని ట్రాక్టర్లు క్యూకడుతున్నాయి.

వేగం పుంజుకునేలా..

క్యూను తగ్గించేందుకు అధికారులు ఫ్యాక్టరీలతో కుస్తీ పడుతున్నారు. క్యూ తగ్గించి.. ప్రభుత్వానికి చెడ్డ పేరు రాకుండా పర్యవేక్షిస్తున్నారు. ఫ్యాక్టరీ వాళ్లతో మాట్లాడుతూ ట్రాక్టర్ల నుంచి కాయలను చకచకా అన్‌లోడింగ్ అయ్యేలా చూస్తున్నారు. మరోవైపు ప్రతిపక్ష నేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటనకు వస్తున్న నేపథ్యంలో అధికారులు శరవేగంగా పని చేస్తున్నారు. మామిడి కాయల అన్‌లోడింగ్ విషయంపై దృష్టి పెట్టి రద్దీ తగ్గించే పనిలో పడ్డారు. ఈనెల 9వ తేదీకల్లా మామిడి రైతులు రోడ్డుపై నిలబడకుండా చేయాలని చూస్తున్నారు. అయితే చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గంలో ఇప్పటికీ 40 శాతం పంట ఉంది. తోతాపురి 30 శాతం పంట ఉంటే నీలం 10 శాతం చెట్లల్లోనే ఉన్నట్లు రైతు సంఘం నాయకులు చెబుతున్నారు. ఈనెల 15వ తేదీ వరకు కూడా రద్దీ తగ్గే ప్రసక్తే లేదని వారు అంటున్నారు.